యాదగిరిగుట్టలో నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, మే 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో భక్తుల సందడి కొనసాగుతున్నది. వేసవి సెలవుల ముగింపు సమీపిస్తుండడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. తిరుమాడవీధులు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల ప్రాంతాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి స్వామివారికి తిరువరాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.56,27,107 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్..

లక్ష్మీనరసింహ స్వామివారిని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ దర్శించుకున్నారు. సోమవారం కొండపైకి చేరుకున్న ఆయన పంచనారసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యాదగిరిగుట్ట దేవస్థానం ప్రాచీనమైన గొప్ప దేవాలయమని కొనియాడారు. రాష్ట్ర ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 20 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతు కె.జెండగే హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్‌చంద్రతో కలిసి జిల్లాలోని విత్తన డీలర్లతో సమావేశమై మాట్లాడారు. విత్తన డీలర్లు రాబోయే వానకాలం సీజన్‌కు సంబంధించి రైతాంగానికి నాణ్యతతో కూడిన విత్తనాలు అమ్మాలని, రైతులు నష్టపోకుండా, నకిలీ విత్తనాల బారిన పడకుండా డీలర్లు సహకరించాలని, అమ్మకాలకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మకూడదని సూచించారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు మార్కెట్లలోనికి రాకుండా నివారించేందుకు నాలుగు మండలాలకు ఒకటి చొప్పున 4 టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తారని, లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. హెచ్‌టీ కాటన్(కలుపు మందును తట్టుకునే ఓ రకం పత్తి)విత్తనాలకు అనుమతి లేదని, అమ్మితే పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని, అలాగే లూజు విత్తనాలు, ఎక్స్‌పైరీ దాటిన విత్తనాలు అమ్మినా చర్యలు ఉంటాయన్నారు. రైతులకు ఈ-పాస్ ద్వారానే ఎరువులు, విత్తనాలు అమ్మాలని సూచించారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ.. డీలర్లంతా వ్యవసాయ, పోలీస్ శాఖలకు సహకరించాలని, రైతులకు మేలు చేయాలని సూచించారు. ఎరువులు, విత్తనాలను అక్రమంగా స్టోర్ చేసినా, రవాణా చేసినా, లూజుగా అమ్మినా జరిమానాతోపాటు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు. ఎవరైనా రైతులను మోసం చేస్తే వెంటనే పోలీస్ శాఖకు టోల్‌ఫ్రీ ద్వారా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనూరాధ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు భూక్యా దేవ్‌సింగ్, పద్మావతి, వెంకటేశ్వర్లు, నీలిమ, జిల్లా విత్తన డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బజ్జూరి రవి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించిన విద్యార్థులకు నేడు ప్రోత్సాహకాలు

మోత్కూరు, మే 20 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల విద్యాలయాల్లో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు సంసథ జిల్లా చైర్మన్ డాక్టర్ లక్ష్మీనర్సింహా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే, డీఈఓ నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలతోపాటు మెమెంటోలు అందజేయనున్నట్లు తెలిపారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులు ఉదయం 11:30 గంటలకు జరుగనున్న సమావేశానికి హాజరు కావాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరం

- భువనగిరి న్యాయ సలహా మండలి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది జైపాల్

భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న భువనగిరి న్యాయ సహాయ, ఉచిత సలహా మండలి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది జైపాల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది శంకర్

భువనగిరి అర్బన్, మే 20 : భవన నిర్మాణ, అసంఘటిత కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భువనగిరి న్యాయ సహాయ, ఉచిత సలహా మండలి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది జైపాల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది శంకర్ అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు ఆదేశాల మేరకు భువనగిరిలో భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు చట్టపరమైన హక్కులు, చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖ ద్వారా పొందే పథకాల లబ్ధిపై అవగాహన కల్పించి కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డు విధిగా పొందాలన్నారు. ఉచిత న్యాయ సలహాల కోసం ఉచిత న్యాయ సహాయ కార్యాలయం, ఆయా కోర్టుల్లో ఏర్పాటైన న్యాయ సేవా సంస్థల నుంచి పొందవచ్చన్నారు. జూన్ 8న అన్ని కోర్టుల ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా న్యాయ సేవా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

- బీఆర్ఎస్ మోత్కూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీను

మోత్కూరు ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీను

మోత్కూరు, మే 20 : ఉమ్మడి నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మోత్కూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను కోరారు. సోమవారం పట్టణంలోని పలువురు పట్టభద్రులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్లాక్ మెయిల్‌కు పాల్పడే వారిని కాకుండా.. విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డిని గెలిపించడంతో ప్రజా, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మర్రి అనిల్‌కుమార్, చేతరాశి వెంకన్న, నల్ల ప్రభాకర్, కంచర్ల క్రాంతిరెడ్డి, బొల్లేటి నరేశ్, మొరిగాల వెంకన్న, పురుగుల మల్లయ్య, జంగ నరేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మా గోడు పట్టదా?

- అన్నదాత ఆక్రందన

వర్షానికి మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



రాజాపేట : పాముకుంట కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం కుప్పలు

ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాత నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు లారీల కొరత, కాంటా కాకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోవడంతోపాటు మరో వైపు అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుంది. తడిసిన ధాన్యాన్ని నిత్యం ఆరబోయడం, మళ్లీ కుప్పలుగా పోసుకోవడం దినచర్యగా మారిందని రైతులు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. సోమవారం రాజాపేట మండలం పాముకుంట కొనుగోలు కేంద్రంలో తాము పడుతున్న ఇబ్బందులను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. మమ్మల్ని ఆదుకునేదెవరని? ప్రభుత్వానికి తమ గోడు పట్టదా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

-రాజాపేట, మే 20

ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్‌కు ఫోన్‌లో తెలిపిన జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

గుండాల మండలం వస్తాకొండూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

గుండాల, మే 20 : ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జండగేను కోరారు. సోమవారం మండలంలోని వస్తాకొండూర్‌లోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు ఫోన్‌లో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై వివరించారు. వారి వెంట వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి, పిట్టల పూర్ణచందర్, జటంగి రాజు ఉన్నారు. అలాగే మండలంలోని మరిపడిగ గ్రామానికి చెందిన వడ్లకొండ రంజిత్ ఇటీవల మరణించగా ఆయన కుటుంబాన్ని సోమవారం జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ పరామర్శించారు.

ప్రజలంతా భక్తిభావం అలవర్చుకోవాలి

ప్రజలంతా భక్తిభావం అలవర్చుకోవాలని భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని వస్తాకొండూర్‌లో జరిగిన లింగమంతుల స్వామి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, నాయకులు పురుగుల మల్లేశ్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డులకు ఎంపిక

రామన్నపేట, మే 20 : మాతృదేవోభవ, పితృదేవోభవ సంస్థ పంచమ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న చిరంజీవి బ్లడ్ బ్యాంక్ హైదరాబాద్ నందు పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా బెస్ట్ సర్వీస్ అవార్డులు అందుకోనున్నట్లు రామన్నపేట మండలానికి చెందిన సామాజిక కార్యకర్తలు వేముల సైదులు, నోముల యాదగిరి, సోమనబోయిన శ్రీమాన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అసమానతలపై ప్రజలను చైతన్యపరుస్తూ వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టినందుకు తమకు ఈ అవార్డులు పరించినట్లు చెప్పారు. ఈ అవార్డు తమ బాధ్యతలను మరింత పెంచిదన్నారు. తాము చేసిన సేవలను గుర్తించిన ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం నిల్వలకు మిల్లుల్లో స్థలం కొరత

- మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం

భువనగిరి అర్బన్, మే 20 : ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని 39 రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతి చేసుకుంటామని, కానీ, మిల్లుల్లో ధాన్యం నిల్వలకు సరిపడా స్థలం లేదని, అందుకోసమే ధాన్యాన్ని దిగుమతి చేసుకోలేకపోతున్నామని మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మార్త వెంకటేశం సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మిల్లుల్లో యాసంగికి సంబంధించి సుమారు 1.80 లక్షల టన్నుల ధాన్యం, వానకాలానికి సంబంధించి సుమారు 1.40 లక్షల టన్నుల ధాన్యం నిల్వ చేసినట్లు తెలిపారు. యాసంగికి సంబంధించి మిల్లులకు కేటాయించిన ధాన్యం సుమారు 2.20 లక్షల టన్నుల ధాన్యం దిగుమతి చేసుకున్నామని, ప్రస్తుతం మిల్లుల్లో సుమారు 5.40 లక్షల టన్నుల ధాన్యం నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం నిల్వ కెపాసిటీ సుమారు 3 లక్షల టన్నులు మాత్రమేనని, మిగతా 2.40 లక్షల టన్నుల ధాన్యం మిల్లుల ఆవరణల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ గోదాముల్లో నిల్వ ఉంచినట్లు తెలిపారు. మిల్లుల వద్ద దిగుమతి చేసుకోవాల్సిన ధాన్యం సుమారుగా 10 వేల టన్నులు ఉందని, ఆ ధాన్యాన్ని కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు దిగుమతి చేసుకుంటామని తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

వలిగొండ, మే 20 : రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నాగారం రైల్వే గేట్ సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం ఎల్లంకి గ్రామానికి చెందిన మాధురి చంద్రశేఖర్‌రావు(56) ఉదయం 9 గంటలకు గుంటూరు నుంచి వికారాబాద్ వెళ్తున్న పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే అధికారుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించామని, మృతుని కుటుంబ సభ్యులు అందుబాటులో ఎవరూ లేరని, రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపారు. మృతుడి భార్య, కుటుంబ సభ్యులు అమెరికాలో ఉంటున్నట్లు రైల్వే పోలీస్ అధికారులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

వలిగొండ, మే 20 : మైనర్‌ను ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్న యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పోలేపాక విష్ణు(20) ఓ మైనర్‌ను ప్రేమ పేరుతో వేధిస్తున్నట్లు బాధితుల ఫిర్యాదు మేరకు నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జైనపల్లిలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సభ్యులు

బీబీనగర్, మే 20 : మండలంలోని జైనపల్లిలో ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యత సంస్థ ఆధ్వర్యంలో ఆర్బీఐ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భువనగిరి సీఎఫ్ఎల్(ఆర్థిక అక్షరాస్యత కేంద్రం) కౌన్సిలర్లు మాధవి, బాలకృష్ణ మాట్లాడుతూ ఆర్బీఐ ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు పేరుతో సైబర్ నేరస్థులు పంపిన లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ పాల్గొన్నారు.

అకారణంగా సిజేరియన్లు చేస్తే చర్యలు

- జిల్లా ఉప వైద్యశాఖ అధికారి డాక్టర్ యశోద

వలిగొండలోని జనని దవాఖానలో తనిఖీ చేస్తున్న జిల్లా ఉప వైద్యశాఖ అధికారి, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

వలిగొండ, మే 20 : ప్రసవానికి వచ్చే గర్భిణులకు అకారణంగా సిజేరియన్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఉప వైద్యశాఖ అధికారి డాక్టర్ యశోద హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులతో కలిసి జిల్లా వైద్యశాఖ అధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జనని మెటర్నిటీ దవాఖానలో ఆకస్మికంగా తనిఖీలు చేసి సిజేరియన్ల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో అధికంగా సిజేరియన్లు చేసే ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు చేపట్టి షోకాజ్ నోటీసులు అందజేస్తున్నామని, ప్రభుత్వ నిబంధనలు పాటించని దవాఖానలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌పీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమన్ కల్యాణ్, పీఓడీటీసీ డాక్టర్ రామకృష్ణ, శౌరి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

రాజాపేట : పాముకుంటలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజాపేట, మే 20 : రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య సేవలు అభినందనీయమని మాజీ సర్పంచ్ జెన్నెపల్లి జ్యోతిప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని పాముకుంటలో మాజీ సర్పంచ్ సహకారంతో భువనగిరి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జయశ్రీ, బాలాజీ, స్పందన, ఉపేందర్‌రావు, సంతోష్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీశైలం కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ.1.50 లక్షలు అందజేసిన మంత్రి కోమటిరెడ్డి

మమతతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మోత్కూరు, మే 20 : మోత్కూరు మున్సిపాలిటీలోని ఆరేగూడేనికి చెందిన దేవర శ్రీశైలం కుటుంబానికి రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. శ్రీశైలం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన భార్య మమత తన పిల్లలతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి తమను ఆదుకోవాలని వేడుకున్నారు. స్పందించిన మంత్రి రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పైళ్ల సోమిరెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మెంట నాగేశ్, రామచంద్రగౌడ్ పాల్గొన్నారు.

వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మే 20 : వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగార్జున రైస్‌మిల్‌ను ఆయన సందర్శించారు. లారీల్లో ధాన్యం దిగుమతి చేసుకోవడానికి కరెంట్ అంతరాయం ఏర్పడుతుందని మిల్లు నిర్వాహకులు తెలిపారు. లారీల సమస్య తలెత్తకుండా త్వరగా లారీలను పంపాలని రైస్‌మిల్ యజమానులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పాక మల్లేశ్‌యాదవ్, భారత లవకుమార్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకుంటాం..

చేనేత కార్మికులకు పని కల్పించి ఆదుకుంటామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని చేనేత సహకార సంఘ భవనంలో నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెస్కో ద్వారా రావాల్సిన 20 లక్షల బకాయిలను ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమై చేనేత సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా హ్యాండ్లూమ్ ఏడీ విద్యాసాగర్, జిల్లా చేనేత నాయకులు తడక వెంకటేశం, భారత లవకుమార్, తడక రమేశ్, కౌన్సిలర్ భోగ భానుమతివిష్ణు, నాయకులు పాల్గొన్నారు.

అశోక్‌కు ఎమ్మెల్యే వీరేశం అభినందన

అశోక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, మే 20: మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమనేత అశోక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్ అందుకున్న సందర్భంగా సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయనను శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. 'రాజకీయాల్లో దివ్యాంగుల భాగస్వామ్యం-తెలంగాణలో అధ్యయనం' అనే అంశంపై పరిశోధన పూర్తి చేయడం దివ్యాంగులకు రాజకీయంగా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై ప్రస్తావిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నోముల గోపాల్, జినుక గోవర్ధన్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లల్లో వసతులు కల్పించాలి

- తాసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారుల వినతి

తాసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

భువనగిరి కలెక్టరేట్, మే 20 : పట్టణంలోని సింగన్నగూడెం బైపాస్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లల్లో మౌలిక వసతులు కల్పించాలని డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఆధ్వర్యంలో సోమవారం తాసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లల్లో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, రోడ్లుకు మరమ్మతులు చేసి గృహప్రవేశాలు చేయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో డబుల్ బెడ్రూం లబ్ధిదారులు చేకూరి సుధాకర్, కొత్త సత్యం, రచ్చ సాయి, పొన్నాల హరికృష్ణ, సామల శ్రీనివాస్, బొమ్మిడి ప్రవీణ్, శ్రీదేవి, మంజుల, శ్రీలత, ఆశ, శంకర్, శివ పాల్గొన్నారు.

కూసుకుంట్ల త్వరగా కోలుకోవాలని పూజలు

సర్వేల్ గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంస్థాన్‌నారాయణపురం, మే 20 : మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన త్వరగా కోలుకొని మునుగోడు ప్రజలకు సేవ చేయాలని మండలంలోని సర్వేల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రామలింగేశ్